బొంతు కమలమ్మకు నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఘనంగా నివాళి అర్పించారు. సోమవారం నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాంధీ చర్లపల్లిలోని బొంతు రామ్మోహన్ నివాసానికి వెళ్లి కమలమ్మ పార్థివ దేహానికి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కొల్లూరులో సివిల్ రైట్స్ డే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో సోమవారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎస్సీలను ఆలయాలకు, ఇతర ప్రదేశాలకు రావద్దన్న ఆంక్షలు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పలు చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ఆర్ఐ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

‘తెల్లాపూర్’లో ఎన్ఎస్ఎస్

- మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా ప్రయత్నం
- పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు

దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టిన హెచ్‌సీయూ వాలంటీర్లు



తెల్లాపూర్‌లో శుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాయదుర్గం: ఆరోగ్యకరమైన, శుభ్రతతో కూడిన ఆహ్లాదకర వాతావరణం అవసరమంటూ హెచ్‌సీయూ నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) యూనిట్ పలు కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా హెచ్‌సీయూ చెంతనే ఉండే తెల్లాపూర్‌ను దత్తత తీసుకొంది. ‘స్వచ్ఛతా హీ సేవా’ కార్యక్రమం పేరిట హెచ్‌సీయూలోని అన్ని విభాగాలు, హార్టికల్చర్, పారిశుద్ధ్య విభాగం, విద్యార్థులు, ఫ్యాకల్టీతో కలిసి స్వచ్ఛభారత్, ‘ఏక్ పేడ్ మా కే నామ్’పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. దత్తత తీసుకున్న తెల్లాపూర్‌లో మాత్రం సేవా కార్యక్రమాలు కొనసాగించాలని నిర్ణయించారు. తెల్లాపూర్‌లో స్వచ్ఛభారత్, సంస్కార్ స్వచ్ఛతా -2024 పేరిట శుభ్రమైన వాతావరణం నెలకొనేలా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పనులను చేపట్టనున్నారు. అంతేకాకుండా శ్రమదానం, ఏక్ పేడ్ మా కే నామ్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం నెలకొల్పడం, వ్యర్థాలు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 50 పండ్ల మొక్కలు ముఖ్యంగా మామిడి, జామ, అల్లనేరేడు, వేప, దానిమ్మ, రావి తదితర మొక్కలను విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నాటారు.



తెల్లాపూర్‌లో క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

అవగాహన కార్యక్రమాలు

తెల్లాపూర్‌లో హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా గ్రామంలో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల పరిసరాల్లో శుభ్రత ,వ్యక్తిగత ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అవగాహన కల్పించనున్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.అలాగే ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, బాటిళ్ల వాడకుండా అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లాపూర్‌లో ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులపై ప్రత్యేక సర్వే నిర్వహించి నివేదిక రూపొందించాలని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్ణయించింది. ఈ ప్రాంతాన్ని కొన్ని భాగాలుగా విభజించి ఆర్థిక, జీవన స్థితిగతులపై ప్రత్యేక సర్వే చేయనున్నారు. ఈ నివేదికను తెల్లాపూర్ పాలక మండలికి అందజేస్తారు.



తెల్లాపూర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డా. కృష్ణయ్య, విద్యార్థులు

తెల్లాపూర్‌పై ప్రత్యేక నివేదిక రూపొందిస్తాం



గాంధీ జయంతి తర్వాత కూడా తెల్లాపూర్‌లో స్వచ్ఛతా కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే వైద్య శిబిరం నిర్వహణ, సర్వే, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తెల్లాపూర్‌పై ప్రత్యేక నివేదిక రూపొందిస్తాం. హెచ్‌సీయూ క్యాంపస్‌తో బాటు చేరువలోని ప్రాంతాలలోనూ ఇలాంటి పరిస్థితులు నెలకొనేలా చేస్తాం. అందుకే తెల్లాపూర్‌ను దత్తత తీసుకున్నాం. స్థానిక ప్రజలు నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

–డా. కృష్ణయ్య,
హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

ప్రజావాణి.. 11 వినతులు

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 వినతిపత్రాలు అందగా 07 టౌన్ ప్లానింగ్, 03 రెవెన్యూ, 1 ఇంజనీరింగ్ విభాగాలకు చెందినవి కావడంతో సంబంధిత అధికానులను సమస్యలను పరిష్కరించాలని డీసీ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని సూచించారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇందులో 5 ఫిర్యాదులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి 5 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్రవణ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

3న ఎస్ఎస్‌సీటీయూలో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: ములుగులోని సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో 2024-25 విద్యాసంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 3 వ తేదీ ఉదయం 9.30 గంటలకు ములుగులోని జాకారం గ్రామంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ భవనం-ట్రాన్సిట్ క్యాంపస్)లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ద్వారా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు బీఏ (హానర్స్) ఇంగ్లిష్, బీఏ (హానర్స్) ఎకనామిక్స్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. అభ్యర్థులు సీయూఈటీ, యూజీ-2024 పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుంది. 12వ తరగతి ఉత్తీర్ణత సాధించిన, అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న అభ్యర్థులు ముఖ్యంగా ప్రాధాన్యత-1 కింద జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 60 శాతం మార్కులు, ప్రాధాన్యత-2 కింద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పాస్ మార్కులు ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ‘బతుకమ్మ’



రాయదుర్గం: బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని ఐసీడీఎస్ శేరిలింగంపల్లి సీడీపీఓ పరిధిలోని రాయదుర్గం సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలలో బతుకమ్మ ఆడారు. సోమవారం గచ్చిబౌలిలోని ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిశ్రీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, జ్యోతి,సంధ్య, శారద, సునీత, నాగమణి, స్వప్న,లక్ష్మీ, శైలజ, శ్రీలత, గాయత్రి నిర్మలమ్మ, మహిళలు కలిసి బతుకమ్మ ఆడారు.

సాకి చెరువు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: బతుకమ్మ ఘాట్ వద్ద ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టుకుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌లతో కలిసి సాకి చెరువును ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పరిశీలించారు. బతుకమ్మ ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ డీసీకి సూచించారు. అలాగే బండ్లగూడ కాలనీలో గల చెరువును కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో రాణించిన ‘మనూ’ మోడల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

రాయదుర్గం: తెలంగాణ సైన్స్ ఫెయిర్ అకాడమీ (టీఎస్ఎఫ్ఏ) నిర్వహించిన 17వ ప్రాంతీయ సైన్స్ ఫెయిర్‌లో మనూ విశ్వవిద్యాలయం మోడల్ స్కూల్ విద్యార్థులు రాణించారు. మొదటి మూడు స్థానాలను కై వసం చేసుకున్నారు. నగరంలోని నారాయణగూడలోని ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఫెయిర్ నిర్వహించగా అందులో విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ కఫీల్ అహ్మద్ మాట్లాడుతూ 12వ తరగతికి చెందిన ఉజ్మాబేగం, 11వతరగతికి చెందిన మహేక్ బేగమ్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.11వ తరగతికి చెందిన మీర్జా జోయాబేగం, సాదియా బేగం ద్వితీయ స్థానంలో, మూడో స్థానంలో ఎండీ అల్తాఫ్, ఎండీ ముస్తఫా, ఎండీ అయాన్ కై వసం చేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా విజేతలకు మెమెంటో ప్రశంసాపత్రాలను, నగదు బహుమతులను అందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు వసీముద్దీన్, పీజీటీ బయోటెక్నాలజీ విద్యార్థులు పర్యవేక్షించారు.

టీహబ్- పానాసోనిక్ భాగస్వామ్యం

ఈ టెక్నాలజీ మార్కెట్‌ను వేగవంతం చేయడానికి సమష్టి కృషి



టీహబ్-పానాసోనిక్ సంస్థ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న రెండు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: భారతదేశంలో పానాసోనిక్ యొక్క అత్యాధునిక నెస్పమ్ హై డెఫినిషన్ పవన్ లైన్ కమ్యూనికేషన్(హెచ్‌డీ-పీఎల్‌సీ) టెక్నాలజీ వాణిజ్యీకరణను వేగవంతం చేయడానికి పానాసోనిక్, టీ హబ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇండియా, జపాన్ మధ్య ఆవిష్కరణ, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని ఈ ఒప్పందం సూచిస్తుంది. నెస్పమ్ హెచ్‌డీ-పీఎల్‌సీ టెక్నాలజీ స్మార్ట్ స్పేస్‌లను సృష్టించేటప్పుడు అదనపు వైరింగ్ అవసరాన్ని తగ్గిస్తుంది. ఈ సందర్భంగా పానాసోనిక్ హోల్డింగ్స్‌లో చీఫ్ ఇంజనీర్/మార్కెటింగ్ మేనేజర్ కొటారో మాట్సువో మాట్లాడుతూ టీహబ్‌తో మా భాగస్వామ్యం ద్వారా భారత్‌లో మా సంబంధాల ను మరింతగా పెంచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు .టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ పానాసోనిక్‌తో మా సహకారం భారతీయ స్టార్టప్‌లకు కొత్త అవకాశాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ మనీష్ మిశ్రా, టీహబ్, పానాసోనిక్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన అవని గోవింద్, సాన్వి బిరాదర్‌లు

శేరిలింగంపల్లి: భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో నిర్వహించిన దేశభక్తి గీతాల పోటీల్లో విద్యాంజలి హైస్కూల్ విద్యార్థులు తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. బీవీపీ గచ్చిబౌలి శాఖ నమో గంగా ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి స్కూల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నమో గంగా ప్రెసిడెంట్ ఎల్ నర్సింహారెడ్డి, సెక్రటరీ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ వెంకన్నలు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బాలత్రిపుర సుందరి, ప్రతినిధులు రామకృష్ణ, నివేదిత, సరోజ్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో..

శేరిలింగంపల్లి: సుచిత్రా ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ 7వ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో శేరిలింగంపల్లి విద్యాంజలి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. సింగిల్స్ విభాగంలో రామకృష్ణాపురం భవన్స్ విద్యాలయంపై విద్యాంజలి విద్యార్థిని అవని గోవింద్ విజయం సాధించారు. అదే విధంగా డబుల్స్ విభాగంలో అవని గోవింద్, సాన్వి బిరాదర్‌లు నేషనల్స్‌కు ఎంపికైనట్లు విద్యాంజలి స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఎల్.నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ బాలత్రిపురసుందరిలు అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

కూకట్‌పల్లి: కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. సోమవారం జలవాయువిహార్‌లో ఉచిత వైద్య శిబిరం, పోషకాహారం అవగాహన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూకట్‌పల్లిలో పారిశుద్ధ్య, ఎంటమాలజీ కార్మికులు సుమారు 3200 మంది ఉన్నారని వీరి కోసం 9 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కూకట్‌పల్లి జోన్‌లోని నాలుగు సర్కిల్స్‌లో 2 చొప్పున, అల్వాల్‌లో ఒకటి చొప్పున మొత్తం 9 మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ఎస్ఐఎస్ అధికారులతో పోషకాహారం, శుభ్రతపై కార్మికులకు అవగాహన కల్పించామని తెలిపారు. మంగళవారం బోయినపల్లి, బాలానగర్ కాలనీ కార్మికులకు రాజు కాలనీలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కమ్యూనిటీహాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఎస్ అధికారులు, ఈఎస్ఐ వైద్యులు, ఉప కమిషనర్ కృష్ణయ్య, ఏఎంఓహెచ్ శ్రీనివాస్, డీసీ ఉదయ్‌కుమార్, కార్యక్రమంలో నోడల్ అధికారి, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

2 నుంచి ఫోక్ ఆర్ట్స్ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్ శిల్పారామం, సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగ్‌పూర్, సంయుక్త నిర్వహణలో అక్టోబర్ 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు డివిజనల్ ఫోక్ ఆర్ట్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు.

- 2వ తేదీ .. పేరిణీ నాగరాజు నృత్య ప్రదర్శన, భోనగిరికి చెందిన మధు ఒగ్గు డోలు, కరీంనగర్‌కి చెందిన అందసి ఆదినారాయణ డప్పు నృత్యాలు, హైదరాబాద్‌కు చెందిన రామారావు మాధురి డ్యాన్స్ ప్రదర్శన ఉంటుంది
- 3వ తేదీ.. ఖమ్మంకి చెందిన అశోక్ బోనాలు, ఆనంద్‌కుమార్ కొమ్మకోయ, మహబూబాబాద్‌కు చెందిన జంపయ్య ధింసా నృత్యం, ఆదిలాబాద్‌కు చెందిన శ్రీధర్ గుస్సాడి నృత్యాలు
- 4వ తేదీ ..కరీంనగర్‌కు చెందిన భువనేశ్వరీ బతుకమ్మ, తాండూర్‌కి చెందిన రమేశ్ చెక్క భజన, ఆదిలాబాద్‌కు చెందిన కుమార్ లంబాడి డ్యాన్స్, శేరిలింగంపల్లికి చెందిన సురభి కళాకారుల నాటకం ఉంటుంది.

ఉద్యోగ విరమణ సత్కారం



మహేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: నల్లగండ్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి సోమవారం పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుడుగా, హెచ్‌ఎంగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జీ హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, రామస్వామి యాదవ్, రవీంద్రప్రసాద్ దూబే, మాజీ ఎంఈఓ వెంకటయ్య, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు శివకుమార్ సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పాఠశాలల ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శాంటా మారియా విద్యార్థుల ప్రతిభ



శేరిలింగంపల్లి: శాంటామారియా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. జాన్‌లాక్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ ఎస్సే ప్రైజ్‌లో విద్యార్థులు నిషి, ఆన్య, రౌనఖ్‌లు తమ ప్రతిభ చూపారు. ఈ పోటీ విద్యార్థులను తత్వశాస్త్రం, రాజకీయ, ఆర్థిక శాస్త్రం, చరిత్ర, మానసిక శాస్త్రం, ధర్మశాస్త్రం, న్యాయశాస్త్రం వంటి అనేక విషయాలపై రాయడానికి ఆహ్వానిస్తోంది. శాంటా మారియా నుంచి నిషి జూనియర్ కేటగిరిలో, ఆన్య, రౌనక్ ఇద్దరూ రాజకీయం విభాగంలో ప్రతిభ చూపి పురస్కారాన్ని పొందారు. కాగా సోమవారం శాంటామారియా ప్రిన్సిపల్ హేమా సంజయ్ విద్యార్థులను అభినందించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మొదటగా రోడ్ల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో రోడ్డు పనులను పూర్తి చేయాలని సూచించారు. వర్షాల వలన దెబ్బ తిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ రషీద్, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, ఆదర్శ్ రెడ్డి, భాస్కర్, నాగమణి, కాలనీ సొసైటీ అధ్యక్షులు వెంకట్‌రావు, వైస్ ప్రెసిడెంట్ నారాయణగౌడ్, డైరెక్టర్ నీలకంఠం, సీనియర్ సిటిజన్స్ సత్యనారాయణ, బాగ్రే, భీంరెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

సన్‌సెట్- సన్‌రైజ్ నాటక ప్రదర్శన



హెచ్ఐసీసీలో కళాకారుడు పద్మశ్రీ మహ్మద్ అలీబేగ్ నాటక ప్రదర్శన

మాదాపూర్: కళాకారుల నాటక ప్రదర్శన అద్భుతంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం రాత్రి ఖదీర్ అలీ బేగ్ 40వ వార్షికోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అలీ బేగ్ థియేటర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్‌సెట్- సన్‌రైజ్ నాటకంలో సుదూర ప్రాంతాలలో ఉండే పిల్లలు, తల్లిదండ్రుల మధ్య ఉండే సంబంధాలను ప్రదర్శించారు. ఈ నాటకం సందర్శకులను ఆకట్టుకుంది.



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం 45 నిమిషాల పాటు భారీ వర్షం కురవడంతో ప్రజలు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. - రాయదుర్గం

ఎంఈఓకు సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం మండల ఎంఈఓ పీపీ రాథోడ్‌ను సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బలరాం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘అశ్రితాస్ గ్రూప్’ కంపెనీకి మొట్టికాయ

- పిటిషనర్‌కు రూ.21.55 లక్షలు చెల్లించండి
- మొత్తం డబ్బును 45 రోజులలోపు అందజేయాలి
- రియల్ ఎస్టేట్ కంపెనీని ఆదేశించిన కమిషన్-3

సిటీ కోర్టులు: పిటిషనర్ చాలా కాలం వేచి ఉన్నా ఫ్లాట్ నిర్మాణం చేపట్టకపోగా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కంపెనీ ఇష్టానుసారం నిర్మాణం ప్రారంభించడం ముమ్మాటికీ అశ్రితాస్ గ్రూప్ రియల్ ఎస్టేట్ కంపెనీది తప్పేనని హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-3 తేల్చింది. పిటిషనర్‌కు సమాచారం లేకుండా ఎలా ఫ్లాట్‌ను రద్దు చేస్తారని మండిపడింది. ఒప్పందం ప్రకారం పిటిషనర్ నుంచి అడ్వాన్స్‌గా తీసుకున్న రూ.16.50 లక్షలను 12 శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా రూ.5 లక్షలు పరిహారం, ఫిర్యాదుదారు ఖర్చుకు రూ. 5 వేలు..45 రోజుల్లోపు చెల్లించాలని హైదరాబాద్ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు ఆర్. రాంగోపాల్ రెడ్డి, కమిషన్ మెంబర్ ఆర్.నారాయణరెడ్డిలతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

మాకు తెలియకుండానే ఫ్లాట్ రద్దు చేశారు..

మియాపూర్‌కు చెందిన జి.వినోద... బీరంగూడ, కిష్టారెడ్డిపేట్‌లో అశ్రితాస్ గ్రూప్ యాజమాన్యం అశ్రితాస్ జ్యువెల్స్ కౌంటీ ప్రాజెక్ట్ పేరుతో ఫ్లాట్లు నిర్మిస్తున్నారని తెలుసుకొని 2019లో ఓ ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. ఫ్లాట్ విలువ రూ. 47.34 లక్షలు కాగా, నిర్మాణం ప్రకారం డబ్బు చెల్లించాలని కంపెనీ ఒప్పందం కుదుర్చుకొని అడ్వాన్స్‌గా రూ.16.50 లక్షలు తీసుకొని పిటిషనర్‌కు అగ్రిమెంట్ కూడా రాసి ఇచ్చారు. అయినా నిర్మాణం మాత్రం ప్రారంభించలేదు. 2023లో పిటిషనర్ ఓ రోజు నిర్మాణ స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా ఎలాంటి సమాచారం లేకుండానే కంపెనీ నిర్మాణం ప్రారంభించింది. దీంతో పిటిషనర్ సమాచారం ఇవ్వకుండా నిర్మాణం ఎలా చేపడతారని కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. దీనికి కంపెనీ స్పందిస్తూ ముందుగా మీకు నోటీసులు జారీ చేశామని అయినా మీరు వాయిదాల ప్రకారం డబ్బులు చెల్లించకపోవడంతో మీ ఫ్లాట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పిటిషనర్ హైదరాబాద్ వినియోగదారుల కమిషనర్-3 సంప్రదించి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ బాధితురాలి నుంచి తీసుకున్న మొత్తం డబ్బును పైన తెలిపిన విధంగా వడ్డీతో సహా చెల్లించాలని ఇటీవల తీర్పు ఇచ్చింది.